# “ఓంబీ గ్రామం శతాబ్దాల కష్టాల రహదారి

సారాయి జంక్షన్ నుంచి వేలాది గిరిజనుల జీవనానికి అడ్డుగోడగా మార్గం”
“అంబులెన్స్ అడుగు పెట్టని ఓంబీ
“ రహదారి లేక ఆగిన అభివృద్ధి
సారాయిఓంబీ మధ్య మానవ వేదనకు అధికారులు స్పందించాలంటూ గ్రామస్తుల మొర”





**సామాన్యుడి అస్త్రం అల్లూరి:** అల్లూరి సీతారామరాజు జిల్లా, దంత్రిగూడ మండలం దంత్రిగూడ అరణ్య ప్రాంతంలో ఉన్న ఓంబీ గ్రామం ప్రజలు అనుభవిస్తున్న రహదారి సమస్య వేదనను కాదు కష్టసాహసాన్ని కాదు జీవన పోరాటాన్ని చెబుతోంది. సారాయి జంక్షన్ నుంచి ఓంబీ గ్రామం వరకు రహదారి లేకపోవడం వల్ల ఈ ప్రాంతంలో అభివృద్ధి అడుగడుగునా నిలిచిపోయింది. ఓంబీ గ్రామానికి వెళ్లే మూడు కిలోమీటర్ల మార్గం వర్షాల్లో బురద పొంగిపొర్లుతూ, వేసవిలో దూళితో కమ్ముకుని, ప్రతి రోజూ మోకాళ్ల లోతు గోతులతో మానవ ప్రయాణాన్ని సవాలు చేస్తోంది. వాహనాలు ఊహించలేనివి నడక కూడా ప్రమాదమే ఇదే గ్రామస్తుల రోజులా గుంది.“అంబులెన్స్ మా ఊరి గడప దాటిన దాఖలే లేదు” గ్రామస్తులలో ఒక సమూహం ఆవేదనగా ఇలా చెబుతుంది. ఎవరైనా అనారోగ్యానికి గురైనా, ప్రసవ వేదన వచ్చినా, ప్రమాదానికి గురైనా ఓంబీ ప్రజలకు చికిత్స కేంద్రం ప్రయాణం ఒక చిన్నపాటి యుద్ధం లాంటిదే.శ్రమతో, భయంతో, ప్రాణపణంగా రోగులను భుజాలపై మోసుకుంటూ సారాయి జంక్షన్ వరకు తీసుకెళ్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.ఈ రహదారిపై ఆధారపడిన నాలుగు ఐదు గ్రామాల్లో 3,000కిపైగా కుటుంబాలు జీవిస్తున్నా, దశాబ్దాల తరబడి సమస్య పరిష్కారం వైపు కదలలేదు.పిల్లల విద్య, అత్యవసర వైద్యం, ప్రభుత్వ సేవలు, బియ్యం, పెన్షన్ పంపిణీఅన్నీ ఈ రహదారి సమస్య కారణంగా కష్టతరమవుతున్నాయి. గ్రామస్తులు అధికారులతో విజ్ఞప్తి చేస్తూ “మా జీవనాన్ని మెరుగుపరచే చిన్న ఆశ బీటీ రోడ్డు మాత్రమే.సారాయి జంక్షన్ నుంచి ఓంబీ వరకు రహదారి త్వరగా నిర్మిస్తే మా పిల్లల భవిష్యత్తు రక్షించబడుతుంది. దయచేసి మా విన్నపంపై ప్రభుత్వం కనీసం ఒకసారి దృష్టి సారించాలి”అని కోరుతున్నారు. శతాబ్దాలినుంచి రహదారి కోసం ఎదురుచూస్తున్న ఓంబీ ప్రజల ఆశలు నెరవేరేనా రోజూ ప్రమాదపు రహదారిపై నడుస్తున్న వారి బాధ ఎప్పుడు తీరుతుంది స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు, యువత ఈ ప్రశ్నలకు సమాధానం కోసం ఎదురు చూస్తున్నారు.

# భీంపల్లిలో కొత్త చరిత్ర సర్పంచ్ అభ్యర్థులను ప్రజలే ప్రశ్నించిన అరుదైన కార్యక్రమం

ఈ కార్యక్రమాన్ని చేపట్టిన 6 జవాజి రాజు మరియు గ్రామస్తులు




**సామాన్యుడి అస్త్రం కమలాపూర్ :** హన్మకొండ జిల్లా కమలపూర్ మండల భీంపల్లి గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తొలిసారిగా గ్రామ ప్రజలు సర్పంచ్ అభ్యర్థులను ఒకే వేదికపైకి రప్పించి, నేరుగా ప్రశ్నలు వేయడం గ్రామ రాజకీయాల్లో కొత్త చరిత్రను సృష్టించింది. ఊరి అభివృద్ధి, భవిష్యత్తు, పారదర్శకత, హామీల అమలుపై ప్రజలు నిష్పాక్షికంగా అభ్యర్థులను నిలదీసిన ఈ కార్యక్రమం గ్రామస్థులలో చైతన్యం పెంచింది.ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని యువత, పెద్దలు కలిసి రూపొందించగా, ప్రధానంగా సమన్వయం వహించినవారిలో 6 జవాజీ రాజు ప్రత్యేకంగా నిలిచారు. ప్రజల ముందు అభ్యర్థులను నిలబెట్టి, గెలుపు తర్వాత గ్రామానికి ఏమి చేస్తారనే విషయంపై స్పష్టమైన వివరాలు చెప్పించే ప్రయత్నం గ్రామంలో మంచి స్పందనను తెచ్చింది. “జిల్లామండల స్థాయిలో భీంపల్లిని ఆదర్శ గ్రామంగా నిలబెడతాం. పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబాన్ని సమానంగా చూస్తాం” అని అన్ని అభ్యర్థులు వేదికపై ప్రజలకు హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత మాటలు అమలు చేయకపోతే ప్రజాశక్తిరంగంలో నిలదీస్తామని గ్రామస్తులు స్పష్టంగా హెచ్చరించడంతో కార్యక్రమం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. అభ్యర్థులు తమ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, పరిశుభ్రత, రైతు సమస్యలు, కమ్యూనిటీ అభివృద్ధి, యువత అవకాశాలపై చేపట్టబోయే చర్యల గురించి విపులంగా వివరించారు. ప్రజలు వేసిన ముఖసూటి ప్రశ్నలకు తగిన సమాధానాలు ఇస్తూ, “మా మాట మా కర్తవ్యం” అని అన్ని అభ్యర్థులు ప్రజలకు భరోసా ఇచ్చారు. గ్రామ ప్రజలు భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్న “ఓటు ప్రతి పౌరుని ఆయుధం” అనే భావాన్ని ప్రస్తావిస్తూ, ఈ ఆయుధాన్ని సరైన అభ్యర్థిని ఎంచుకోవడానికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి రమేష్, తిరుపతి బిక్షపతి, వాసాల శ్రీనివాస్, జవాజీ కనకయ్య, సముద్రాల మొగిలి, తోట శంకరయ్య, బైస శ్రీనివాస్, భూపతి ప్రవీణ్, బోయిని సంపత్, తాళ్లపల్లి గణేష్, బచ్చల శ్రీకాంత్, కుక్కల ఓదెలు, కురిమిళ్ళ సంతోష్, బొంకురి రమేష్ తదితర గ్రామ పెద్దలు, యువత భారీగా పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజలు స్వయంగా ముందుకు రావడం, అభ్యర్థులను నేరుగా ప్రశ్నించడం గ్రామంలో కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలికినట్లుగా భావిస్తున్నారు.

# గుట్కా, పాన్ మసాలా పరిశ్రమపై కేంద్రం కొరడా.. రాబోతున్న కొత్త చట్టం

- గుట్కా, పాన్ మసాలా పరిశ్రమపై కొత్త చట్టం తెస్తున్న కేంద్రం
- ఉత్పత్తి పై కాకుండా యంత్రాల సామర్థ్యం ఆధారంగా పన్ను విధింపు







**సామాన్యుడి అస్త్రం గోదావరిఖని :** నిబంధనలు ఉల్లంఘిస్తే ఐదేళ్ల జైలు శిక్ష, భారీ జరిమానాలు సిగరెట్ల పై కూడా సెస్సు విధానంలో కీలక మార్పులకు సన్నాహాలు దేశంలో పెద్దగా నియంత్రణ లేని గుట్కా, పాన్ మసాలా పరిశ్రమను కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కీలక చట్టాన్ని తీసుకురాబోతోంది. ‘హెల్త్ సెక్యూరిటీ టు నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్, 2025’ పేరుతో రూపొందించిన ఈ బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ కొత్త చట్టం ప్రకారం, గుట్కా, పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులపై పన్ను విధించే విధానం పూర్తిగా మారనుంది. ఇప్పటివరకు తుది ఉత్పత్తి ఆధారంగా పన్ను విధిస్తుండగా, ఇకపై వాటి తయారీకి ఉపయోగించే యంత్రాల ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా ప్రత్యేక సెస్సు విధించనున్నారు. చేతితో తయారుచేసే యూనిట్లకు కూడా ప్రతినెలా తప్పనిసరిగా నిర్దిష్ట మొత్తంలో సెస్సు చెల్లించాల్సి ఉంటుంది. నిబంధనలు కఠినతరం ఈ కొత్త విధానంలో, ఉత్పత్తి ఎంత జరిగిందనే దానితో సంబంధం లేకుండా ప్రతి నెలా తయారీదారులు సెస్సు చెల్లించాలి. ఒకవేళ యంత్రాలు లేదా యూనిట్ 15 రోజులకు మించి పనిచేయకపోతే మాత్రమే మినహాయింపు లభిస్తుంది. ప్రతి తయారీదారు తప్పనిసరిగా ప్రభుత్వంతో రిజిస్టర్ చేసుకోవాలి, నెలవారీ రిటర్న్లు దాఖలు చేయాలి. అధికారులు ఎప్పుడైనా తనిఖీలు, విచారణ, ఆడిట్ చేసేందుకు వీలు కల్పించాలి. ఈ నిబంధనల ఉల్లంఘనకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించేలా బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయి. అవసరమైతే సెస్సును రెట్టింపు చేసే అధికారాన్ని కూడా ప్రభుత్వం తన వద్దే ఉంచుకోనుంది. ధరలపై ప్రభావం ఉండదు మరోవైపు, సిగరెట్లపై ఉన్న జీఎస్టీ పరిహార సెస్సును కూడా కేంద్ర ఎక్సైజ్ చట్టం పరిధిలోకి మారుస్తూ మరో బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. అయితే, ఈ మార్పుల వల్ల గుట్కా, పాన్ మసాలా లేదా సిగరెట్ల ధరలపై వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పన్ను రేట్లలో ఎటువంటి మార్పు ఉండదని, కేవలం పన్నుల వసూలు విధానాన్ని క్రమబద్ధీకరించి, పారదర్శకత పెంచడమే లక్ష్యమని వివరించారు

## వైద్యం కోసం వచ్చిన ప్రజలకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలి తీర్చినా మహమ్మద్ సర్వర్ కతిజా బి వారి కుటుంబ సభ్యులు





**సామాన్యుడి అస్త్రం జనగామ** కీర్తిశేషులు మహమ్మద్ సర్వర్ కతిజా బి వారి కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో జనగామ జిల్లా మాత శిశు ఆసుపత్రి వద్ద మాతృమూర్తులకు వైద్యం కోసం వచ్చిన ప్రజలకు ఆకలితో ఉన్నవారికి ఒక పూట అన్న సమర్పణ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఈరోజు ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన మహమ్మద్ సర్వర్ కతేజాబీ కి అమ్మ ఫౌండేషన్ టీం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు వైద్యం కోసం వచ్చిన మాతృమూర్తులకు ప్రజలకు మహా అన్నదానం కార్యక్రమం అమ్మ ఫౌండేషన్ టీం సభ్యుల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి ,పండుగ నరేష్, బింగి నరసింహులు,తుంగ సతీష్ ,ఎండి అఫ్రోజ్ ,ఉల్లెంగుల మణీ,గునిగంటి నర్సింగరావు ,హరీష్ నిరంజన్, ఎండి అజిత్ ,కుమార్ తదితరులు పాల్గొన్నారు

## హన్మంతాపూర్ పాఠశాలకు మౌలిక వస్తువుల వితరణ



**సామాన్యుడి అస్త్రం జనగామ** హన్మంతాపూర్ పాఠశాలలో మౌలిక వసతి సదుపాయాలు కల్పనకు దాతలు అందించే సహకారం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దూడల రమేష్ అన్నారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల యొక్క అవసరాల కోసం 12 వేల రూపాయల విలువైన మైక్ సెట్, కుర్చీలు, టేబుల్, స్టేషనరీ, క్యాష్ అవార్డులను లయన్ పబ్బా చంద్రశేఖర్ లయన్స్ క్లబ్ జనగామ జిల్లా చైర్మన్ అందజేసిన వాటిని స్వీకరించిన ప్రధాన ఉపాధ్యాయుడు మాట్లాడుతూ సంపాదించడం ముఖ్యం కాదు అందులో ఎంతో కొంత సహాయం చేయడం అనేది ముఖ్యమని, తమ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాపరమైనవి అందించుటకు తమ వంతుగా 15 సంవత్సరాలుగా తాను పనిచేస్తున్న పాఠశాలకు వితరణ చేయడం తన అదృష్టమని, పదిమందికి సహకరించే తపన మనిషిలో ఉంటే జన్మ సార్ధకము చేకూరుతుందని, తృప్తినిస్తుందని దాతలు విద్యార్థులకు చేయుత నందిస్తే అది విద్యా వికాసానికి తోడ్పడుతుందని క్రియేటివిటీ పెంచుతుందని, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి దాతలు అందించే సహకారం మరువలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ కన్నా పరశురాములు, అధ్యక్షుడు కారంపూడి సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, కోశాధికారి సూదగాని ప్రవీణ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ దూసరి కీర్తన, ఉపాధ్యాయులు పి.విద్యావతి, తుమ్మ ఆరోగ్యమ్మ , అంగన్వాడి టీచర్స్ మమత ,సంధ్య ఆయాలు అనిత, స్వప్న, ఐలమ్మ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## సింగరేణి ఆధ్వర్యంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు

జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్




**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం -2025 సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీన ఉదయం 10.00 గంటలకు పివి కాలనీ భద్రాద్రి స్టేడియం నందు సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు(దివ్యాంగులకు) క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించడమైనది.ఈ విషయమై ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ... అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక అవసర పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని నింపి వారిని ప్రోత్సహించేందుకు గాను క్రీడా పోటీలు నిర్వహించాలని నిర్ణయించడమైనది. ఈ క్రీడాపోటీలు మానసిక వికలాంగులకు మరియు శారీరక వికలాంగులకు వారికి అనువైన పద్ధతిలో రన్నింగ్ రేస్ బాల్ త్రో, లాంగ్ జంప్ వంటి సులువైన ఆటలను ఆడించడం జరుగుతుంది. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం కూడా అందజేయడం జరుగుతుంది. కాబట్టి మణుగూరు ప్రాంత దివ్యాంగుల పాఠశాలల విద్యార్థులు మరియు ఇతర దివ్యాంగులు కూడా ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగ పర్చుకోవలసినదిగా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలియజేశారు.

